రైతు బజారు కలేనా?

మార్కాపురం జనాభా సుమారు లక్ష	
మొత్తం వార్డులు	35
ఉన్న కూరగాయల మార్కెట్లు	1
మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు రోజుకు సుమారు రూ.5 లక్షలు	

- మార్కాపురంలో కలగా మారిన రైతుబజారు ఏర్పాటు
- మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిందే రేటు..

మార్కాపురం:

డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో రైతు బజారు ఏర్పాటు కలగా మారింది. ప్రస్తుతమున్న కూరగాయల మార్కెట్ సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పాటైంది. ఉమ్మడి జిల్లాలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఒంగోలు, చీరాల, కందుకూరులలో రైతు బజార్లను ఏర్పాటుచేసి మార్కాపురాన్ని విస్మరించారు. దీంతో మున్సిపల్ కూరగాయల మార్కెట్ చిన్నది కావడంతో ఉదయం పూట మార్కెట్‌లో కొనుగోలుదారులు ఎక్కువగా వస్తే కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తే బురదగా మారి ఏమాత్రం రాకపోకలకు అనువుగా ఉండదు. తప్పనిసరి పరిస్థితుల్లో మార్కెట్ లోపల, బయట ప్రజలు కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నూతన కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. అయితే ఎన్నికలు రావడంతో తాత్కాలికంగా పక్కనపెట్టారు. నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తున్నా పట్టణాభివృద్ధిపై దృష్టిసారించిన దాఖలాలు లేవు.

గతంలో ఇలా...

గతంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మార్కెట్ యార్డులో హోల్‌సేల్ దుకాణాలను, దీనితోపాటు తర్లుపాడు రోడ్డులోని పెద్ద వాటర్ ట్యాంకు వద్ద, దోర్నాల సెంటరులోని నాయుడు బజారులో వ్యాపారులు తాత్కాలికంగా కూరగాయలు అమ్మేందుకు ఏర్పాట్లు చేశారు. దీనితో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఏ ప్రాంతానికి చెందిన వారు ఆ ప్రాంతంలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు సులువుగా మారింది. ఇటీవల ఈ విధానాన్ని తీసివేశారు. దీనితో మళ్లీ యధావిధిగా కూరగాయల మార్కెట్‌కు రావాల్సి వస్తోంది.


మార్కెట్ వ్యూ


కూరగాయల విక్రయాలు

ఈ ప్రాంతాల వారికి చాలా దూరం..

ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడా చిన్న చిన్న దుకాణాల్లో కూరగాయలు అమ్ముతున్నప్పటికీ ఎక్కువ ధర కావడంతో ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న మార్కెట్‌లోకి వస్తుంటారు. ఇందిరమ్మ కాలనీ, పూలసుబ్బయ్య కాలనీ, ఎస్సీ, బీసీ కాలనీ, అరుణోదయ కాలనీ, టీచర్స్ కాలనీ, కొండారెడ్డికాలనీ, భగత్‌సింగ్ నగర్, ఎస్టేట్, ఏకలవ్య కాలనీ తదితర ప్రాంతాల వారు కూరగాయలు కొనాలంటే సుమారు రెండు కిలోమీటర్లు రావాలి. దీనితో ఆటో చార్జీలు, టూవీలర్లపై వచ్చే వారైతే పెట్రోల్ అదనపు భారం అవుతుంది.

కూరగాయల అమ్మకాలు ఇలా...

మార్కాపురం కూరగాయల మార్కెట్‌కు సమీప గ్రామాలైన వేములకోట, దరిమడుగు, చింతగుంట్ల, గజ్జలకొండ, రాయవరం, యచవరం, మొద్దులపల్లి, బోడపాడు, నికరంపల్లి, నాగులవరం, జమ్మనపల్లి, కోలభీమునిపాడు తదితర గ్రామాల నుంచి రైతులు కూరగాయలు తెచ్చి అమ్ముతుంటారు. వీటితోపాటు మార్టూరు నుంచి దొండ, బెండ, వంకాయలు, ఆకుకూరలు, బెంగళూరు నుంచి క్యారెట్, బీట్‌రూట్, క్యాబేజీ, మదనపల్లి నుంచి టమోటా తదితర కూరగాయలు వస్తుంటాయి. ఇక్కడ నుంచి త్రిపురాంతకం, దోర్నాల, కంభం, తర్లుపాడు, పెద్దారవీడు, యర్రగొండపాలెం, శ్రీశైలం తదితర ప్రాంతాలకు వెళ్తాయి. ఇలా రోజుకు సుమారు రూ.5 లక్షల వరకూ కూరగాయల అమ్మకాలు జరుగుతున్నాయి. కూరగాయల మార్కెట్‌లో రైతులు నేరుగా అమ్ముకోవాలంటే మున్సిపల్ కాంట్రాక్టరుకు ఫీజు చెల్లించాలి. బయటపెట్టి అమ్మితే ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ కాంట్రాక్టర్, లోకల్ వ్యాపారుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కూటమి కట్టి దోపిడీ

మార్కెట్‌లోని వ్యాపారులు పండుగ సమయాల్లో కూటమి కట్టి ఒకరే కూరగాయలు అమ్మేందుకు వేలంపాట పాడుకొని అధిక ధరలకు విక్రయిస్తున్న సాంప్రదాయం ఇటీవల ప్రారంభమైంది. దీంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధరలకే కూరగాయలు కొంటున్నారు. పండుగ సమయాల్లో, మార్కెట్‌లో వ్యాపారులు ఎవరైనా చనిపోతే వ్యాపారులు కూటమి కట్టి ఒకరికి మాత్రమే అమ్ముకునే అవకాశం ఇస్తున్నారు. అటువంటి పరిస్థితుల్లో బయట 20 రూపాయలైతే మార్కెట్‌లో మాత్రం 40 రూపాయలు అమ్ముతారు.

రైతు బజారు ఏర్పాటుతో లాభాలు:

- మార్కాపురంలో రైతుబజారు ఏర్పాటు చేసినట్లయితే రైతులు నేరుగా దళారులు మధ్యవర్తులు లేకుండా మార్కెట్‌కు వచ్చి అమ్ముకోవచ్చు.
- ప్రజలకు నాణ్యమైన కూరగాయలు, తాజా కూరగాయలు లభిస్తాయి.
- అధిక ధరల బాధ ఉండదు
- పండించే రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుంది
- రైతు బజారు మేనేజర్ ఎప్పటికప్పుడు తాజా కూరగాయలు తెప్పించడంతోపాటు ధరలపై నియంత్రణ ఉంటుంది.


మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

రైతు బజారును ఏర్పాటు చేయాలి



మార్కాపురంలో రైతు బజారు లేకపోవడంతో మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన ధరకే కూరగాయలు కొంటున్నాం. ప్రభుత్వం రైతు బజారును ఏర్పాటుచేస్తే ప్రజలతోపాటు రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. అధిక ధరలు తగ్గుతాయి.

– నాలి రజనీ, మార్కాపురం

క్లుప్తంగా

ఆషాఢ అమావాస్య అలంకరణలో పోలేరమ్మ


ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ

మార్కాపురం టౌన్: ఆషాఢ అమావాస్య పర్వదినం సందర్భంగా మార్కాపురం పట్టణ పరిసర ప్రాంతాల ఇలవేల్పైన గ్రామదేవత శ్రీ అల్లూరి పోలేరమ్మను ఆదివారం అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అందులో భాగంగా భక్తులు పోలేరమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ కుంకుమ బండ్లతో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్న కేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

వృద్ధాశ్రమానికి వితరణ


బియ్యం, సరుకులు అందజేస్తున్న మహేష్

కురిచేడు: పడమరవీరాయపాలెంలోని శ్రీ కరుణ వృద్ధాశ్రమానికి మార్కాపురం వాసులు సామగ్రి వితరణ ఇచ్చారు. ఆదివారం కొప్పరపు సత్యమహేష్, సత్యవతి, శైలజ, బిందు, సుధాకర్‌లు.. 125 కిలోల బియ్యం, 15 కిలోల నూనె, కూరగాయలు, పండ్లు అందజేశారు. ఇది తమకు ఎంతో సంతృప్తినిస్తుందని మహేష్ పేర్కొన్నారు.

నూతన ఎస్సైల నియామకం


పట్టణ నూతన ఎస్సై సైదాబాబు


నూతన రూరల్ ఎస్సై అంకమరావు


మార్కాపురం: పట్టణ ఎస్సైగా ఎం. సైదాబాబు, రూరల్ ఎస్సైగా పి. అంకమరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వర నాయక్‌లను బదిలీ చేశారు. వారి స్థానంలో పామూరు ఎస్సైగా పనిచేస్తున్న సైదాబాబు.. మార్కాపురం పట్టణ ఎస్సైగా, దోర్నాల ఎస్సైగా పనిచేస్తున్న పి. అంకమరావు రూరల్ ఎస్సైగా నియమితులయ్యారు. త్వరలో వీరు బాధ్యతలు స్వీకరించనున్నారు.

కంభం తహసీల్దార్‌కు ఘన సన్మానం


తహసీల్దార్ కిరణ్‌ను సన్మానిస్తున్న చర్చి కమిటీ సభ్యులు

మార్కాపురం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కంభం తహసీల్దార్ విడుదల కిరణ్.. మంత్రి బాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకున్నారు. దీంతో ఆదివారం పట్టణంలోని ఏబీఎం కాంపౌండులోని తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సామ్యేలు, పి. జయరావు, కోశాధికారి రామస్వామి, సంఘ కాపరి అమృతతేజ్, బి. సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా నారద జయంతి


పాత్రికేయులను సన్మానిస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

మార్కాపురం టౌన్: ప్రపంచానికి తొలి పాత్రికేయుడు నారద మహర్షి అని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ్ కాళంరాజు విశ్వేశ్వరరావు అన్నారు. ఆదివారం నారద జయంతిని పురస్కరించుకుని ప్రెస్‌క్లబ్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ కె. రామకృష్ణ అధ్యక్షత వహించారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ నారద మహర్షి ముల్లోకాలు తిరుగుతూ సమాచారాన్ని సేకరించి, చేరవేసేవారన్నారు. రిపోర్టర్లు నరేంద్ర, శ్రీనివాస్, నరసింహరావును సత్కరించారు. కార్యక్రమంలో సూర్య నారాయణబాబు, నారాయణాచార్యులు, మేడా ప్రసాద్, అంజిరెడ్డి, రామ్‌చరణ్, బి. రామకృష్ణ, నాగేశ్వరరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, పాత్రికేయులు ఓబయ్య, నాగార్జున, శ్రీనివాస్, అంజి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గాయం రామి రెడ్డికి నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, ఉడుముల శ్రీనివాసుల రెడ్డి


నివాళులర్పిస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు జంకె, పక్కన వెన్న హనుమా రెడ్డి

తర్లుపాడు: అనారోగ్యంతో శనివారం మృతి చెందిన జెడ్పీటీసీ వెన్న ఇందిర తండ్రి గాయం రామిరెడ్డి మృతదేహానికి అశ్రునయనాలతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య తుది కార్యక్రమం నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జున రెడ్డి దంపతులు, ఉడుముల శ్రీనివాసుల రెడ్డి దంపతులు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వెన్న హనుమా రెడ్డి నివాళులర్పించారు. మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, డీవీ కృష్ణారెడ్డి, ఉడుముల రామనారాయణ రెడ్డి, ఉడుముల గురవారెడ్డితో పాటు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రధానోపాధ్యాయునిగా, పలు సేవా కార్యక్రమాల్లో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

బాబోయ్.. ప్రయాణమా!


గొట్లగట్టులో బస్ షెల్టర్‌కు అడ్డంగా పెట్టిన ఆటో, దుకాణాలు


గొట్లగట్టు బస్టాండ్‌లో బస్ కోసం రోడ్డుపై ఇలా


బస్ షెల్టర్ లేని పెదారికట్ల బస్టాండ్

- బస్‌షెల్టర్‌కు అడ్డంగా ఆటోలు, చిరువ్యాపారుల దుకాణాలు
- బస్సుకోసం రోడ్డుపైనే ప్రయాణికుల పడిగాపులు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో బస్ షెల్టర్స్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినా, ఎండ కాచినా రోడ్డుపై నిలబడాల్సిందే. గొట్లగట్టు, కొనకనమిట్ల, పెదారికట్ల బస్టాండ్ సెంటర్, చినారికట్ల జంక్షన్ సెంటర్లలో బస్ ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. గొట్లగట్టులో బస్ షెల్టర్ ఉన్నప్పటికీ లేనట్టే అయింది. గతంలో బస్ షెల్టర్ నిర్మించినప్పటికీ ఈ షెల్టర్‌కు అడ్డంగా ఆటోలు నిలపటంతో పాటు చిరు దుకాణాలు ఏర్పాటు చేసుకోవటంతో బస్‌షెల్టర్ అక్కడ ఉందన్న సంగతే అంతా మరచిపోవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో బస్ కోసం వేచి ఉండే ప్రయాణికులు నడిరోడ్డుపై పడిగాపులు కాస్తున్నారు. ఒంగోలు, పొదిలి, గిద్దలూరు, మార్కాపురం వైపు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ బస్‌ల కోసం బస్టాండ్ సెంటర్లో రోడ్డుపై నిలబడాల్సిన పరిస్థితి దాపురించిందని పలువురు వాపోతున్నారు.

కొనకనమిట్ల, చినారికట్ల, పెదారికట్లలో బస్ షెల్టర్‌లు ఏర్పాటు చేయాలి

ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రం కొనకనమిట్లతో పాటు పెదారికట్ల బస్టాండ్ సెంటర్లలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని అంతా కోరుతున్నారు. గతంలో కొనకనమిట్ల సెంటర్లో ఉన్న బస్ షెల్టర్, చినారికట్ల జంక్షన్‌లో ఉన్న బస్ షెల్టర్లను రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. అయితే మళ్లీ బస్ షెల్టర్‌లు నిర్మించకుండా వదిలేశారు. అలాగే ఎదురాళ్లపాడు, మునగపాడు, దొనకొండ అడ్డరోడ్డు జంక్షన్, మర్రిపాలెం బస్టాండ్ సెంటర్లోకూడా బస్ షెల్టర్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శాస్త్రీయ దృక్పథంతో అభివృద్ధి


మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

మార్కాపురం: శాస్త్రీయ దృక్పథం ద్వారానే సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జేవీవీ 18వ వార్షిక జిల్లా మహాసభలు జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి. శరత్ అధ్యక్షతన నిర్వహించారు. పాఠ్యపుస్తకాల్లో సైన్సుకు సంబంధించిన అంశాలను తొలగించడం బాధ కలిగిస్తోందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామారావు మాట్లాడుతూ యువత మద్యం మత్తుకు బానిసలు అవుతున్నారని, డ్రగ్స్ కూడా వాడటం శోచనీయమన్నారు. డాక్టర్ బి. శరత్, డాక్టర్ పి స్వరూపారెడ్డి, ఎస్. శ్రీనివాసులు, దేవ ప్రసాద్, భాస్కర్, మాలకొండారెడ్డి, షేక్ బషీరున్‌బేగం, ఒ. వీరారెడ్డి, కె. సుబ్రమణ్యాచారి, జిల్లా కోశాధికారి తిరుమలయ్య, రమణయ్య, ఖాజాహుస్సేన్ పాల్గొన్నారు. మ్యాజిక్ షోలు ఆకట్టుకున్నాయి. గాజు పెంకులపై నడవడం, ఇనుపమేకులపై కూర్చోవడం, మండుతున్న కర్పూరాన్ని మింగడం, నీళ్లతో దీపాలు వెలిగించడం వంటి ప్రదర్శనల వెనుక దాగివున్న సైన్సు సూత్రాలను వివరించారు.

రెండు బైక్‌లు ఢీ.. వ్యక్తికి గాయాలు

మార్కాపురం: రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలైనట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ ఆదివారం తెలిపారు. చీమకుర్తి నుంచి మార్కాపురానికి బైక్‌పై లోకేష్ రెడ్డి వస్తుండగా మార్కాపురం నుంచి రాయవరం వైపు వెళ్తున్న బైకు వై. జంక్షన్ వద్ద ఢీకొట్టడంతో లోకేష్‌రెడ్డికి గాయాలయ్యాయి. చికిత్స చేయిస్తున్నట్లు ఎస్సై రెహమాన్ తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ


ఫర్దున్‌కు నగదు అందజేస్తున్న ఎస్ఐ నాగమల్లేశ్వరరావు

ముండ్లమూరు: మండలంలోని వేముల గ్రామానికి చెందిన అనాథ కుటుంబానికి ముండ్లమూరు ఎస్ఐ వి. నాగమల్లేశ్వరరావు పది వేల ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన షేక్ మౌలాభి శనివారం ఆటో బోల్తాపడి మృతి చెందిన విషయం తెలిసినదే. మౌలాభి భర్త కాలేషా పదేళ్ల క్రితం వినుకొండ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఇద్దరు పిల్లలు ఫర్దున్, కరిష్మాలను తల్లి మౌలాభి కూలీ పనులు చేస్తూ పోషిస్తోంది. శనివారం ఉమామహేశ్వరపురం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. కుమారుడు ఫర్దున్ దర్శిలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కుమార్తె కరిష్మా వేముల హైస్కూల్లో పదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలుసుకున్న ఎస్ఐ నాగమల్లేశ్వరరావు ఆ కుటుంబానికి పది వేలు అందజేసి మానవత్వం చాటుకున్నారు. దీంతో ఆపద సమయంలో ఆదుకున్నందుకు గ్రామస్తులు ఎస్ఐను అభినందించారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా


తర్లుపాడు - తుమ్మల చెరువు రహదారిలో నరికివేసిన వేపచెట్లు

తర్లుపాడు: మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదం అధికారుల అలసత్వంతో కాగితాల వరకే పరిమితమైంది. అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను, గుట్టలను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రం తర్లుపాడు నుంచి తుమ్మలచెరువు వెళ్లే ప్రధాన రహదారి వెంట సుమారు 10 సంవత్సరాల క్రితం ఉపాధి హామీ నిధులతో వేప, కానుగ చెట్లను నాటారు. వేప చెట్లు ఏపుగా పెరగడంతో అక్రమార్కుల కన్ను వాటిపై పడింది. దీంతో రహదారికి ఇరువైపులా ఉన్న వేపచెట్లను నరికి ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అటవీ, రెవెన్యూ అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

కంభం చెరువుపై తేరాతేజి సందడి


కట్టపై నిలిచిన వాహనాలు

కంభం: చారిత్రక కంభం చెరువు కట్టపై తేరాతేజి వేడుకలను ఆదివారం ముస్లింలు ఉత్సాహంగా జరుపుకున్నారు. నూతన జంటలు, వారి కుటుంబ సభ్యులతో కట్టపై సందడి వాతావరణం నెలకొంది. చెరువుకట్టపై ఉన్న దర్గాలో ప్రార్థనలు చేశారు.

తప్పిన ఇద్దరు పిల్లలు అప్పగింత..

దర్శికి చెందిన ఓ చిన్నారి తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి ఏడుస్తూ తిరుగుతూ పోలీసుల కంటపడింది. ఎస్సై పులిరాజేష్ సిబ్బందితో కట్టపై వెతికించి పాప తల్లిదండ్రులను గుర్తించి వారికి అప్పగించారు. కంభం పట్టణానికి చెందిన ఓ చిన్నబాబు తప్పిపోయి ఏడుస్తుండగా తల్లిదండ్రులను గుర్తించి అప్పగించారు.


దర్గాలో ప్రార్థనల కోసం బూందీ, కొబ్బరికాయలు కొంటున్న భక్తులు

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న సంస్థ కార్యవర్గ సభ్యులు

పొదిలి: సమాజంలోని ప్రజలంతా సుఖ శాంతులతో శాంతియుతంగా జీవించాలనేదే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని, వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వాసవి కళ్యాణ్ సదన్‌లో సంస్థ ద్వితీయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మానవతా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. అత్యధిక సభ్యులతో పొదిలి సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. నూతన కమిటీ మరింత ఉత్సాహంగా సేవలు అందించాలన్నారు. కార్యక్రమానికి కల్లం సుబ్బారెడ్డి అధ్యక్షత వహించగా, నూతన కమిటీ సభ్యుల చేత రామచంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందచేశారు. కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. చైర్మన్‌గా పార్థసారధి, వైస్ చైర్ పర్సన్‌గా నూర్జహాన్, నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో చైర్మన్ మువ్వల పార్థ సారధి, వైస్ చైర్ పర్సన్‌గా షేక్ నూర్జహాన్, కన్వీనర్‌గా కల్లం సుబ్బారెడ్డి, జిల్లా కన్వీనర్‌గా కె.యల్లమందారెడ్డి, అధ్యక్షునిగా సామంతపూడి నాగేశ్వరరావు, కార్యదర్శిగా బండి అశోక్, కోశాధికారిగా సోమిశెట్టి చిరంజీవి, సంయుక్త కార్యదర్శిగా భూమా సుమంత్ వైద్యశాఖ ప్రతినిధిగా గూడూరి వినోద్, విద్యాశాఖ ప్రతినిధిగా టీవీ రెడ్డి, మీడియా ప్రతినిధిగా షేక్ బాజీ కరీముల్లా, పర్యావరణ కమిటీ ప్రతినిధిగా మేడా నరసింహారావు, అడ్మినిస్ట్రేటివ్ కమిటీ సభ్యులు, డైరెక్టర్లుగా కాటూరి వెంకట నారాయణబాబు, శ్రావణి వెంకటేశ్వర్లు, యక్కలి శేషగిరిరావు, టి.వెంకటరావు, బెల్లంకొండ విజయలక్ష్మి, డాక్టర్ యర్రం వెంకటరెడ్డి, ఎం.కరీముల్లా బేగ్, సోమిశెట్టి శ్రీదేవి, వై.కిరణ్మయి, బొగ్గవరపు శ్రీనివాసరావు(అమ్మవారి శాల శ్రీను), చిట్టింశెట్టి వెంకట కృష్ణారావు, డాక్టర్ మణి, రావూరి శ్రీకాంత్, ఎద్దు నగేష్, మామిడి వెంకటేశ్వర్లు, మేడా అనంత శ్రీనివాసరావు, చల్లా రాఘవరెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లి లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, కుంకుమ పూజలు, నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.